



# మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం




బుధవారం 24 జూన్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 2




# యువత వ్యసనాలకు గురికావద్దు





భానుపురి/కోదాడ /అనంతగిరి.

మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం జూన్ 26 సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఈగల్ ఫోర్స్ ఉత్తర్వుల మేరకు సూర్యాపేట జిల్లా పోలీసుల అధ్వర్యంలో వారం రోజుల పాటు డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అనంతగిరి మండల పరిధి అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల నందు విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన పై పోలీసు ల ఆధ్వర్యంలో అవగాహన కల్పించి ఉజ్వల భవిష్యత్తుపై అనుసరించాల్సిన విధివిధానాల పట్ల చైతన్యపరిచారు. ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు నేటి యువత దేశాభివృద్ధికి పాటుపడే వనరులుగా ఎదగాలని ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకై నిరంతరం కృషి చేయాలని కోరారు. గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా, ఇన్స్పిరేషన్ గా తీసుకోవాలి, సమాజానికి ఉపయోగపడే వనరు కావాలి, ఇష్టం ఉన్న, నైపుణ్యం ఉన్న రంగంపై దృష్టి పెట్టాలి, గొప్ప శాస్త్రవేత్తలు, గొప్ప లీడర్స్ కావాలి అని ఎస్పి విద్యార్ధులను చైతన్య పరిచారు. యువత, విద్యార్థులు దేశ సంపద, దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్నది కావున విద్యార్థుల్లో, యువతలో మార్పు రావాలి, డ్రగ్స్ నిర్మూలన కోసం బాధ్యతగా ఉండాలి అని కోరారు. డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి, డ్రగ్స్ కు అలవాటుపడ్డ వారు నేరాలకు పాల్పడుతున్నారు, అనారోగ్యాలకు గురౌతున్నారు అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలలో యాంటీ డ్రస్ టీమ్స్ ఏర్పాటు చేశాము, విద్యాసంస్థల్లో ఈ టీమ్స్ డ్రగ్స్ నిర్మూలనకు పని చేయాలి, అధికారులకు సమాచారం అందించాలి అన్నారు. సమాజంలో చెడ్డపేరు వస్తుంది అన్నారు. ఇది మన దేశ యువ శక్తిని నిర్వీర్యం చేస్తుంది అన్నారు. డ్రగ్స్ వినియోగం, రవాణా, సరఫరా చేయడం తీవ్రమైన నేరం అన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడిన విద్యార్థులు, యువత గురించి సమాచారం ఇవ్వండి వీరికి కౌన్సిలింగ్ ఇస్తాము, వీరిలో మార్పునకు కృషి చేస్తాము అన్నారు. మన సమాజంలో డ్రగ్స్ లేకుండా నిర్మూలించడం మన అందరి బాధ్యత అన్నారు. సమాజంలో డ్రగ్స్ ను నిర్మూలించడంలో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలి, డ్రగ్స్ కు దూరంగా ఉండాలి అని అన్నారు. సైబర్ నేరాలు అనేవి ఇప్పుడు సమాజంలో మరో పెద్ద సమస్య అని అన్నారు, సైబర్ నేరగాళ్లు ఉచితాలు ఆశలు చూపి ఆర్థికంగా నష్టపరుస్తారు, ఓటిపి లు, పిన్ నంబర్స్ చెపితే బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులు పోతాయి అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ లో సంప్రదిస్తే వ్యక్తిగత వివరాలు చెప్పవద్దు అని ఎస్పి కోరారు. ప్రస్తుత సమాజంలో మరో ప్రధాన సమస్య రోడ్డు ప్రమాదాలు వీటివల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం అంతా సమస్యలు ఎదుర్కొంటుందని అన్నారు, విద్యార్థులు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని వాహనాలపై వేగంగా వెళ్ళవద్దు అని త్రిబుల్ రైడింగ్ లాంటివి నిర్వహించకూడదని బైక్ పై పందాలు పెట్టుకోకూడదని కోరారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు కలలు పిల్లలపై పెట్టుకుంటారని రోడ్డు ప్రమాదాలకు గురై తల్లిదండ్రుల కలలను ఆశలను అందాకారం చేయకూడదని అన్నారు. డ్రగ్స్ కు దూరంగా నిర్మూలనకు పాటుపడతాం డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దడానికి రహిత తెలంగాణ రాష్ట్రంగా ఏర్పాటు చేయడంలో ముందుంటామని ప్రతిజ్ఞ చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పోలీసు కళాబృందం వారు డ్రగ్స్ నిర్మూలన, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణా రెడ్డి, మేళ్లచెరువు ఎస్ఐ నవీన్ కుమార్, షి టీమ్ ఎస్ఐ మల్లేష్, కళాశాల ప్రిన్సిపాల్ డా.సురేష్ కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ ఏం.ఈశ్వరయ్య, వైస్ చైర్మన్ జైపాల్ రెడ్డి, ప్రసాద్, భూపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## శ్రీ సంతోషిమాత దేవాలయంలో నేడు బ్రహ్మోత్సవం సందర్భముగా సర్వం సిద్ధం

భానుపురి /సూర్యాపేట కల్చరల్




జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో విఘ్నేశ్వరుని మానస పుత్రిక శ్రీ సంతోషిమాత అమ్మవారి బ్రహ్మోత్సవం నేడు (బుధవారం) ఒక్కరోజు అత్యంత వైభవపేతంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు శ్రీ సంతోషిమాత దేవాలయం అధ్యక్షులు బ్రాహ్మ0డ్లపల్లి మురళీధర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1995 జూన్ 8న సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీ సంతోషిమాత అమ్మవారిని జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం పీఠాధిపతులు శ్రీ అభినవొద్దండ నృసింహ భారతి మహాస్వామి కరకమలములచే ప్రతిష్టించుకొని 31 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఉదయం 6 గంటలకు దేవాలయంలో వేంచేసి ఉ న్న శ్రీ సంతోషిమాత, శ్రీ సత్యసాంబశివుడు, శ్రీ లక్ష్మీ గణపతి, క్షేత్రపాలక ఆంజనేయస్వామి, సంతాన నాగదేవత, మానసా దేవి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకము, ఉదయము 8.05 నిమిషములకు కలశ స్థాపన, ఉదయం 10 గంటలకు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేకము గాసామూహికంగా కుంకుమార్చన, పసుపు కొమ్ముల పూజ, గాజుల పూజ, పుష్పార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవం సందర్భంగా శ్రీలక్ష్మీగణపతి, రుద్ర, లలిత హటరీమం తోపాటు మహా పూర్ణాహుతి, శ్రీ సంతోషి మాత అమ్మవారికి త్రిభువన మహా సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించి అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవాలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శివరామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వ హిస్తున్నందున భక్తులు అధి కసంఖ్యలోపాల్గొని అమ్మ వారిఅనుగ్రహం పొందాల్సి ందిగా కోరారు.










## మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్మిద్దాం

భానుపురి /సూర్యాపేట టౌన్



దేశంలో రోజుకి పెచ్చుమీరి పోతున్న మతోన్మాదుల ఆగడాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహిం చాల్సిన అవసరం ఉన్నదని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం సిపిఐ సూర్యాపేట జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారారని మన దేశం పైన ఎన్ని సుంకాలు విధించినా నోరుమెదపకుండా ఉండడం విచారకరమని అమెరికా విధించిన సుంకాల వల్ల దేశ ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని, రూపాయి మారకం విలువ పూర్తిగా పడిపోయిందని12 ఏళ్ల నాడు నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ఎన్నికైనప్పుడు 52 రూపాలు ఉన్న డాలర్ విలువ నేడు 96 రూపాయలు పడిపోవడం వల్ల అన్ని రకాల నిత్య జీవితాసర వస్తువుల ధరలు పెరిగిపోయి సామాన్యులు విలవిలలా డుతున్నారని,దేశంలోని విద్యార్థులు,నిరుద్యోగులు, కవులు, కళాకారులు మోడీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉండడం వల్లనే కాక్రోచ్ జనతా పార్టీకి భారీ స్థాయిలో స్పందన లభిస్తుందని, ఈనాడు దేశంలో రాష్ట్రంలో అస్తిత్వ ఉద్యమాలు తీవ్రస్థాయిలో ఊపందుకున్నాయని తమకు జరిగిన అన్యాయం పట్ల దేశంలోని వివిధ వర్గాల ప్రజలు గొంతెత్తి నిలదీస్తున్నారని ఇందుకు సిపిఐ పార్టీ హర్షం వ్యక్తం చేస్తూ అస్తిత్వ ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, కుల ఉన్మాదాన్ని మత ఉన్మాదాన్ని మాత్రమే వ్యతిరేకిస్తామని త్వరలో దేశవ్యాప్తంగా చేపట్టబోయే జన గణనలో కులగణన ను చేపట్టి ఏ కుల జనాభా ఎంత ఉందో లెక్క తీసి దేశ ప్రజలకు వివరించాలని, జనాభా దామాషా పద్ధతుల్లోనే బడ్జెట్లో నిధులు కేటాయించి స్వాతంత్ర ఫలాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ఆహ్వానం పలకగా పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు ధూళిపాళ ధనుంజయ నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, మండవ వెంకటేశ్వర్లు ,కంబాల శ్రీనివాస్, బూర వెంకటేశ్వర్లు ఎస్కే లతీఫ్, దేవరం మల్లీశ్వరి, ఎస్కే సాయబెల్లి ,జడ శ్రీనివాస్, కొండ కోటయ్య ,రెమిడాల రాజు , కాంపాటి వెంకటయ్య ,చేపూరి కొండలు ఉత్పతల కోటమ్మ ,అమరారపు పున్నయ్య ,గొంగడి భద్రారెడ్డి ,చింతకాయల రవి ,కందుల వెంకటేశ్వర్లు ,ఖమ్మంపాటి రాము, పిల్లుట్ల కనకయ్య ,దొడ్డ వెంకటయ్య , చిలకరాజు శ్రీను ,ఏ లక్ష్మి, రే కట్టే లింగయ్య ,పోతురాజు రాజేశ్వరరావు, ఎడవెల్లి శ్రీకాంత్, పరికె భరత్, రాజారాశీ సారెడ్డి పాపిరెడ్డిపాల్గొన్నారు.

## విద్యుత్ వైరు తగిలి పాలిచ్చే బర్రె మృతి

భానుపురి/ సూర్యాపేట టౌన్



సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు పాండ్య నాయక్ తండలో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన వైరు తగిలి ఓ పాలిచ్చే బర్రె మృతి చెందింది. ఈ ఘటనతో బాధిత రైతు కన్నీరుమున్నీరుగా విలపించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాండ్య నాయక్ తండకు చెందిన ధరవత్ బిక్షంకు చెందిన పాలిచ్చే బర్రె ప్రతిరోజులాగే మేత కోసం సమీపంలోని అడవికి వెళ్లింది. తిరిగి వస్తున్న సమయంలో తండకు ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే రైతుకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న ధరవత్ బిక్షం తన జీవనాధారమైన పాలిచ్చే బర్రె మృతి చెందడంతో తీవ్ర ఆవేదనకు గురై బోరున విలపించాడు. బర్రె మృతి కారణంగా తనకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తండ పరిసరాల్లో విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపించారు. బాధిత రైతుకు తక్షణమే నష్టపరిహారం అందించడంతో పాటు విద్యుత్ శాఖ అధికారులు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను మరమ్మతులు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.